ప్రజాశక్తి
బుధవారం 5 జులై 2023 5
శ్రీ సత్యసాయి



ఇక్బాల్ అవుట్ .?

హిందూపురం సమన్వయకర్తగా దీపిక



దీపికా



ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం వైసిపి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను ఆ పదవి నుంచి తప్పించారు. ఆ స్థానంలో దీపికారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఆ పార్టీ ప్రకటన జారీ చేసింది. 2019 ఎన్నికల సమయంలో మహమ్మద్ ఇక్బాల్‌కు హిందూపురం ఎమ్మెల్యే టిక్కెట్టు ఇచ్చారు. టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో ఆయన విజయం సాధ్యపడలేదు. అప్పటి నుంచి ఆయనే ఇన్‌ఛార్జిగా ఉంటూ వచ్చారు. ఈ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఇక్బాల్‌కు వెంటనే ఎమ్మెల్సీ పదవినిచ్చారు. అప్పటి నుంచి ఆయన ఇక్కడే ఉంటూ వచ్చారు. అయితే ఇక్బాల్‌కు స్థానిక నాయకులు కొంత మందికి పడటం లేదు. విభేదాలు బాహాటంగానే పలుమార్లు జరిగాయి. ఈ క్రమంలోనే రామకృష్ణారెడ్డి హత్య జరగడం నేరుగా ఇక్బాల్‌పైనే పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. ఆయన ఈ ఆరోపణలను ఖండించారు. స్థానిక నాయకులు కొంత మంది అధిష్టానానికి, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జీగానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను తప్పిస్తున్నారన్న ప్రచారం చాలాకాలంగా సాగుతూ వచ్చింది. ఇటీవల తిరుపతిలో జరిగిన సమావేశానికి ఇక్బాల్‌కు ఆహ్వానించకుండా దీపికారెడ్డిని ఆహ్వానించారు. అప్పుడే కొత్త పేరు తెరపైకి ఇచ్చింది. దీపికారెడ్డి పేరు అనుహ్యాంగా రావడం తిరుపతి సమావేశానికి పిలిపించడంతో చర్చనీయాంశం అయ్యింది. ఈమె పేరు అనూహ్యాంగా తెరపైకి రావడంతోపాటు, ఇప్పుడు హిందూపురం పార్టీ సమన్వయకర్తగానూ నియమించడంతో ఆమె ఎవరు.? ఏ రకంగా తెరపైకి వచ్చిందన్న చర్చ సాగుతోంది. భర్త రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆమె మాత్రం బిసి సామాజిక తరగతికి చెందినది. భర్త వ్యాపారవేత్త కాగా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ఆమె తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఈమెకు స్థానికంగా ఏ మేరకు మద్దతు లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే దీపికారెడ్డి కూడా ముందు నుంచి పార్టీలో చురుగ్గా పాల్గొన్న దాఖలాల్లేవు. బయటకు నుంచి ఉన్నఫలంగా రాజకీయ అరంగేట్రం చేయడంతో స్థానిక నాయకులను ఈమె ఏ మేరకు సమన్వయం చేసుకోగలరన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. వైసిపిలో హిందూపురం నియోజకవర్గంలో ముందు నుంచి గ్రూపు తగాదాలున్నాయి. రెండు, మూడు గ్రూపులుగా రాజకీయాలు ఇక్కడ నడుస్తున్నాయి. ఈ గ్రూపులను కొత్తగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన దీపికారెడ్డికి సహకారం ఏ రకంగా అందుతున్నది సందేహస్పాదంగనానే ఉందని చెప్పవచ్చు. అది కూడా మైనార్టీలు అధికంగానున్న ఈ నియోజకవర్గంలో మైనార్టీ నాయకుడుగానున్న మహమద్ ఇక్బాల్‌ను కాదని దీపికారెడ్డిని తీసుకొచ్చారు. మార్పు జరుగుతుందని తెలిసినప్పటి నుంచే మహమ్మద్ ఇక్బాల్‌కు టిక్కెటు వచ్చే ఎన్నికల్లో ఖరారు చేయాలని మైనార్టీ నాయకులు హిందూపురం పట్టణంలో ప్రనదర్శనలు నిర్వహించి, మద్దతు తెలిపారు. ఈ సమయంలో ఆయన కాదని కొత్త వారికిస్తే వారి మద్దతు ఏ మేరకు దీపికారెడ్డికి ఉంటుందన్న చర్చ పార్టీ వర్గాల్లోనూ నడుస్తోంది. అది కూడా తెలుగుదేశం పార్టీకి కంచుకోటలాగానన్న హిందూపురంలో ఈ మార్పు వైసిపికి ఏ మేరకు దోహదపడగలలదన్నదీ ప్రశ్నార్థకమే. పార్టీలోని గ్రూపు తగాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టే చర్యలు కాకుండా నాయకత్వాన్ని మార్చినంత మాత్రానా ఆ పార్టీకి ప్రయోజనం చేకూరుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

డిజిటల్ ఎకానమీగా సత్యసాయి జిల్లా

- ఆ దిశగా అందరూ కలిసి రావాలి
- ప్రధాని నరేంద్ర మోడీ
- వర్చువల్ ద్వారా సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం
- పుట్టపర్తి నుంచి పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి జిల్లా మొత్తాన్ని డిజిటల్ ఎకానమీ దిశగా మార్చాలని, ఆ దిశగా దీనిని నెరవేర్చేందుకు అందరూ కలసి వస్తే వచ్చే శ్రీ సత్యసాయిబాబా జయంతి నాటికి జిల్లా మొత్తాన్ని డిజిటల్‌గా మారుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. న్యూఢిల్లీ నుంచి మంగళవారం నాడు వర్చువల్ విధానం ద్వారా ప్రధాని పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌ను బటన్ నొక్కి ప్రారంభించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈయనతో పాటు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, శ్రీసత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ ఛాన్సలర్ కె.చక్రవర్తి, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు రహైకో హిర, ఎస్ఎస్.నాగానంద్ వి.మోహన్, శ్రీసత్య సాయి సేవ ఆర్గనైజేషన్స్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నిమిష్ పాండ్యాలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ప్రధాని మోడీ ప్రసంగించారు. ఏ ఆలోచన అయినా మానవతా విలువలతో కూడిన కార్యాచరణ సాగించినప్పుడు అత్యంత ప్రభావితంగా ఉంటుందన్నారు. సత్యసాయిబాబా మానవాళికి ఎన్నో సేవా కార్యక్రమాలు అందించారని, ఆయన చూపిన మార్గం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. పుట్టపర్తిలో సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం మరో అద్భుతం అన్నారు.



పుట్టపర్తి ప్రశాంతి నిలయం నుంచి సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోడీ

సాంకేతిక, ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా భారత్

ప్రస్తుతం భారతదేశం కూడా తన విధులకు ప్రాధాన్యతనిస్తూ మెరుగైన అభివృద్ధి దిశగా కదులుతోందని ప్రధాని తెలిపారు. స్వాతంత్ర్య శతాబ్ధి దిశగా పయనిస్తూ అమత్‌కాల్‌కి 'కర్తవ్య కాల' అని పేరు పెట్టాం అన్నారు. ఈ ప్రతిజ్ఞల్లో ఆధ్యాత్మిక విలువల మార్గదర్శకత్వం, భవిష్యత్తు కోసం తీర్మానాలు ఉంటాయన్నారు. భారతదేశం సాంకేతికత, ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా ఉందన్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు మద్దతునిచ్చే ప్రపంచంలోని టాప్ 5 ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఇప్పుడు ఒకటిగా మారిందని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీ, 5జీ వంటి రంగాల్లో ప్రపంచంలోని అగ్రగామి దేశాలతో భారత్ పోటీ పడుతోందని పేర్కొన్నారు.

సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించిన గవర్నర్

పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉదయం ప్రశాంతి నిలయంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మహాసమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. అంతకుముందు ప్రశాంతి నిలయంలో ఉన్న శాంతిభవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ని కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నంది విగ్రహాన్ని అందజేశారు. ప్రశాంతి నిలయంలో గౌరవ మర్యాదపూర్వకంగా పోలీసుల వందనంను గవర్నర్ స్వీకరించారు అనంతరం రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

విలేకరులకు నో ఎంట్రీ

సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక మీడియాకు అనుమతి నిరాకరించారు. కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరులు ఎవరినీ లోపలికి పంపలేదు. దీంతో విలేకరులందరూ బయటనే వేచి ఉండాల్సి వచ్చింది. పాత్రికేయులను అనుమతించకుండా సత్యసాయి ట్రస్టు తీసుకున్న నిర్ణయంపై పలువురు పాత్రికేయులు అసహనం వ్యక్తం చేశారు.

ఆత్మీయసమ్మేళనాన్ని విజయవంతం చేయండి

ధర్మవరం టౌన్ : మడకశిరలో ఈనెల 10న నిర్వహించే ముస్లీం మైనార్టీల ఆత్మీయసమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని హిందూపురం పార్లమెంట్ ప్రధానకార్యదర్శి నాగూరు హుస్సేన్ ముస్లీం మైనార్టీలకు పిలుపు నిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ముస్లీం మైనార్టీలు మాట్లాడారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో ముస్లీంలకు చేసింది ఏమీలేదన్నారు. అంతేకాకుండా ముస్లీంలపై దాడులకు పాల్పడ్డారన్నారు. వచ్చే ఎన్నికలలో మైనార్టీలంతా ఏకమైన వైసీపీని గద్దెదించడానికి అందరూ సన్నద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో తెలుగుమహిళారాష్ట్ర ప్రధానకార్యదర్శి సాహెబ్బీ, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు అత్తార్ రహీంబాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాళ్లపల్లిషరీఫ్, నాయకులు బాబాఫకృద్దీన్, ఉస్మాన్, బాబావలి, బాబు తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

హిందూపురం : మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతినికాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలాజీ మనోహర్ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమానుల్లా. యూనుస్, జమీల్, ఆయాజ్, లక్ష్మీరెడ్డి, నరసింహ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

హిందూపురం : ఆశ వర్కర్లు ఎదుర్కోంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప డిమాండ్ చేశారు. ఆశా డేను పురస్కరించుకుని మంగళవారం ఇందిరా పార్కులో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతు ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. తెలంగాణ తరహా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5లక్షలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు పని ఒత్తిడి తగ్గించాలన్నారు. సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుతో అధికలాభాలు

ఓబుల దేవర చెరువు : పండ్ల తోటల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించి మంచి లాభాలు ఆర్జించవచ్చునని ఎపిడి శ్రీనివాస్ రెడ్డి రైతులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పండ్ల తోటల పెంపకం పై ఉపాధి సిబ్బందికి, రైతులకు ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ సూపర్వైజర్ జనార్ధన్ మాట్లాడుతూ నష్టాల ఊబిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు హార్టికల్చర్ ఎంతో తోడ్పాటు అందిస్తుందని చెప్పారు.ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పండ్లతోటల సాగుకు తోడ్పాటును అందిస్తుందన్నారు. అర్హులైన రైతులందరూ పండ్ల తోటలు సాగు చేసుకునే లాభాల బాటలో పయనించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏపీవో సోమశేఖర్, ఎంపీపీ పర్వీన్ షామీర్ భాష, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, సిఎల్ఆర్‌సి కోర్స్ డైరెక్టర్ శారద, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఎపిడిఎఫ్ అసిస్టెంట్ ప్రతాపరెడ్డి ఎనర్జీ స్టాఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అంతా మోసం : టిడిపి

మడకశిర : వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకం పచ్చిబూటకమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. స్థానిక బాలాజీ నగర్‌లోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్న ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు. విద్యుత్‌ఛార్జీలను విపరీతంగా పెంచి పేదల నడ్డివిరిచారన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్,నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగే గౌడ, నియోజకవర్గ మీడియా కో ఆర్డినెటర్ బెగార్లపల్లి రవికుమార్, వైబీ హళ్లి రవీంద్ర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

రూ.100 దాటిన టమోటా ధర

పచ్చిమిర్చి కిలో రూ.140
మిగిలినవి రూ.40 పైనే
బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు



రొళ్లలోని కూరగాయల మార్కెట్

ప్రజాశక్తి- రొళ్ల

కూరగాయల ధరలు సామాన్యులకు దడ పుట్టిస్తున్నాయి. ధరలు వింటే చాలు సామాన్య ప్రజల గుండె గుబేల్ మంటోంది. టమాటా, పచ్చిమిర్చి ధరలు సెంచరీ దాటేశాయి. రొళ్లలో టమాటా ధర రూ.100, పచ్చిమిర్చి రూ.140 ధర పలుకుతున్నాయి. మిగిలిన కూరగాయల ధరలు రూ.40కి తక్కువ లేవు. రెండు నెలల నుంచి ఎండలు మండిపోవడంతో స్థానికంగా కూరగాయ పంటలు తగ్గటంతో కూరగాయల దిగుమతి తగ్గిపోయి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

గత రబీలో సాగు చేసిన టమాటా పంట ఏప్రిల్లోనే పూర్తయ్యిందని అవసరాల కోసం అప్పటి నుంచి కర్నాటక రాష్ట్రం తుమకూరు, సిర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని హోల్‌సేల్ వర్తకులు చెబుతున్నారు. ఏప్రిల్ చివరలో టమాటా ధరలు భారీగా పతనం అయ్యాయి. మార్కెట్లో 25 కిలోల బాక్స్ రూ.50లు పలకని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలువురు రైతులు టమాటాలను కోయకుండా పొలంలోనే వదిలేశారు. ఆతరువాత ఎండలు విపరీతంగా పెరగడం, ఇదే సమయంలో అకాల వర్షాలు పడడంతో టామాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. సరిగ్గా రెండు నెలల క్రితం మే మొదటి వారంలో హోల్‌సేల్ మార్కెట్లో టమాటాల 25 కేజీల బాక్స్ రూ.150 ధర వుంది. రిటైల్‌లో కిలో రూ.10 చొప్పున విక్రయించారు. తరువాత క్రమేపీ పెరుగుతూ అదే నెల చివరినాటికి కిలో రూ.30కు చేరుకుంది. జూన్‌లో మరింత పెరుగుతూ వచ్చింది. మొదటి వారంలో కిలో రూ.35కు, రెండో వారంలో రూ.40కి, మూడో వారంలో 50కి, చివరి వారంలో ఏకంగా రూ.100కు చేరింది. ప్రస్తుతం రొళ్లలో టమోటా బాక్స్ రూ.1.700 నుంచి రూ.2 వేలు పలుకుతోంది. రవాణా, కళాసీల ఛార్జీలు, ఇతర ఖర్చులు కలుపుకుని ఒక్కో బాక్స్ రూ.1,800 నుంచి రూ.2,100 రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నామని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. పచ్చిమిర్చి ధర కూడా గణనీయంగా పెరిగింది. మార్కెట్లో రిటైల్‌లో కిలో రూ.140కి విక్రయిస్తున్నారు. పచ్చిమిర్చి పంటను చాలా ఎక్కువ సాగు చేస్తుంటారు. అది కూడా ఏప్రిల్లో పూర్తవడంతో. మండల అవసరాల కోసం కర్నాటక ప్రాంతాల నుంచి పచ్చిమిర్చిని దిగుమతి చేసుకుంటుంటారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా పంట తగ్గిపోవడంతో కర్నాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నట్టు వర్తకులు చెబుతున్నారు. అక్కడే కిలో రూ.100 పడుతోందని అంటున్నారు. నెల రోజుల క్రితం పచ్చిమిర్చి కిలో రూ.50 వుండగా, ఇప్పుడు మూడు రెట్లు పెరిగింది. అల్లం ధర చుక్కలను తాకుతోంది. రకాన్ని బట్టి కిలో రూ.200 నుంచి రూ.240 అమ్ముతున్నారు. మిగిలిన కూరగాయల ధరలు సైతం క్రమేపీ పెరుగుతున్నాయి. బీరకాయలు కిలో 80, బెండకాయలు రూ.50, దొండకాయలు రూ.40, వంకాయలు రూ.40 పలుకుతున్నాయి. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి : సిఐటియు



పోస్టర్లు విడుదల చేస్తున్న అంగన్వాడీలు

ఓబుల దేవర చెరువు : అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల10 అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలన్నారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అంగన్వాడీ విద్యను బలోపేతం చెయ్యాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్లు, వై రంగమ్మ, కమలమ్మ ,వరలక్ష్మి, మణిమాల, ఆదిలక్ష్మి, మేరీ సుజాత, విమలమ్మ, షమీం, పద్మావతి, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. మంగళవారం కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్డు లోని అంగన్వాడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నిసా, లక్ష్మి, పద్మావతి, శారద, మాధవి సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్థక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందజేస్తున్న ఐసిడిఎస్‌ను, అంగన్వాడీలను పరిరక్షించాలని కోరారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని కోరారు.

శ్రీహరికోటకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈ నెల 13న శ్రీహరికోటకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు కదిరి డిపోమేనేజర్ తెలిపారు. ఈనెల 13న శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ కేంద్రం నుండి 'చంద్రయాన్-3' ను ఇస్రో సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి అంతరిక్షములోకి పంపుతోందన్నారు. ఈ దృశ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు, ప్రజల కోసం 13న ఉదయం 4గంటలకుకదిరి డిపో నుండి ఎక్స్-ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లుకదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కొత్తచెరువు : ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రధానంగా డెంగ్యూ వ్యాపించకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఎఎంఒ లక్ష్మీ నాయక్ తెలిపారు డెంగ్యూ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రమణయ్య, ఎంపిహెచ్ఒ కంబగిరి స్వామి, సిహెచ్ఒ గౌరీదేవి, సూపర్‌వైజర్ నరసింహులు, లాలానాయక్, రామలక్ష్మి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాధితులు, నాయకులు

'మాపాప ఆచూకీ తెలపండి'

ప్రజాశక్తి -పెనుకొండ

మా పాప మాకు కావాలంటూ పట్టణంలోని దర్గా పేటకు చెందిన సాఫియా అనే చిన్నారి తల్లిదండ్రులుషేక్ ఖలీల్ , షేక్ రేష్మ రోడ్డెక్కిన సంఘటన పెనుకొండ పట్టణంలో చోటుచేసుకుంది. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద పాప తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాలుగు సంవత్సరాల కుమార్తె షాఫియా గత 23 రోజుల కిందట తప్పిపోయిందన్నారు. పాప ఆచూకీ ఇంతవరకు దొరకలేదన్నారు. పాప తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో రోడ్డుపై వాహనాలు స్తంభించిపోయాయి. విషయం తెలుసుకున్న కియా ఎస్ఐ వెంకటరమణ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని పాప తల్లిదండ్రులకు సర్ది చెప్పారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనను విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పాప తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక దర్గాపేట వాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు


ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పరిగి బస్టాండ్‌లోని ఆక్రమణలను అధికారులు తొలగించారు. మున్సిపల్ షాపింగ్ కాంపేక్స్ నిర్వహకులు రోడ్డును సైతం వదలకుండా ఆక్రమించారు. రెండు రోజులుగా కురుస్తున్న చిన్న పాటి వర్షాలకే ఆ కాంప్లెక్స్ గోడలు కూలిపోయాయి. దీంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పండింది. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులను అప్రమత్తం చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కాంప్లెక్స్‌ను మరమ్మతు చేయించి ప్రస్తుతం అద్దెకు ఉన్నా వారికే ఇస్తామని చెప్పారు. ఇక ముందు ఎవరైన ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుంటే వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు షాపు రూము లీజును రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎసిపి ఆనంద్ కుమార్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

9న కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఈ నెల 9న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ కార్యదర్శి నాగభూషణ కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు చైర్మన్ నరేందర్ రెడ్డి పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు తెలిపారు. శిబిర దాతలుగా ఉబ్బర రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం (ఆర్ ఆర్ గ్రాండ్ బిల్డింగ్స్ యజమాని-అనంతపురం) కుమార్తె లిఖిత అల్లుడు విశ్వ తేజ రెడ్డి లు వ్యవహరించనున్నారని తెలిపారు. ఈశిబిరం రోటరీక్లబ్, శంకర కంటి ఆసుపత్రి-బెంగళూరు, అనంతపురం జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివయ్య, రత్న శేఖర్ రెడ్డి, ప్రసన్న కుమార్, గట్టు హరినాథ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు



ఆసుపత్రి భవనాన్ని వైసిపి రంగు చూపిస్తున్న నాయకులు

వైసిపిది రంగుల ప్రభుత్వం : టిడిపి

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కి వైసిపి రంగులు వేయడం పట్ల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికఆసుపత్రి వద్ద ఆమె మాట్లాడుతూ అభివద్ధి చేయడం చేతకాక ,తమ అసమర్థత ను కప్పి పుచ్చుకోవడానికి ఇలా తమ ప్రభుత్వమే చేసినట్టు తమ పార్టీ రంగులను పెనుకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కి వేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు వైసిపి రంగులు వేసి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుడిబండ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల కోసం ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యాసామగ్రి అందజేత

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండలంలోని గుమ్మల్లకుంట గ్రామానికి వరిమడుగు ఓబిరెడ్డి రూ.16వేలు విలువ చేసే విద్యాసామగ్రిని అందజేశారు. నోటుపుస్తకాలు, పలకలు, ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, చెన్నకేశవ, చిట్టిబాల ఓబిరెడ్డి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని దాది రెడ్డి పల్లి గ్రామ సమీపంలో ఉన్న అక్క దేవతల ఆలయ అభివృద్ధికి గోరంట్ల మండలానికి చెందిన దాతలు విరాళం అందజేశారు.ఆ లయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నాగపడుగు నిర్మాణంలో టైల్స్ ఏర్పాటుకు గోరంట్ల మండలం శెట్టిచిన్నంపల్లికి చెందిన చౌడు రెడ్డి, అరునమ్మ దంపతులు ఆధ్వర్యంలో కుమారుడు వరుణ్ రెడ్డి రూ.17 వేలను పూజారి వెంకటేష్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

నల్లచెరువు : మండలంలో 2022-23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీకి సంబంధించి మంగళవారం మండలకేంద్రంలో ప్రజావేదికను నిర్వహించారు. మొత్తం ఉపాధి పనులకు గాను జరిగిన అవినీతిలో రికవరీ చేసినది రూ.16,165లుగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు రామాంజులు, ఎపిడి రెహానా బేగం, ఎంపీడీవో శకుంతల, అసిస్టెంట్ విజిలెన్స్‌అధికారి నాగేశ్వరరావు, ఎస్‌ఆర్‌పి కాంతయ్య, ఎపిఒ మంజుల తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్ : రెండు రోజులు పర్యటన నిమిత్తం పుట్టపర్తికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి పల్లె గవర్నర్‌ను కోరారు.

'టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

బత్తలపల్లి : టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లి మండలంలోని ఓబులాపురం పంచాయతీలోని రామాపురం, కోడెకండ్ల, ఓబులాపురం,చిన్నెకుంటపల్లి గ్రామాలలో ఇంటంటికి వెళ్లి టిడిపి ప్రకటించిన మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్ర నాయుడు, చల్లా శ్రీనివాసులు, కేశవ, సర్పంచి ప్రభాకర్ రెడ్డి, రవి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసులు,చౌదరి, చిట్రా నాగభూషణ, సోము, ఉమాపతి నాయుడు, భాస్కర, నాగేంద్ర, నారాయణస్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన 'బత్తుల'

కదిరి టౌన్ : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్, సీనియర్ నేత బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలో మంత్రి నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రిలో బత్తల హరిప్రసాద్, తదితరులు

నష్టపోయిన ప్రతి రైతుకూ బీమా చెల్లించాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-కనగానపల్లి

వాతావరణ పరిస్థితుల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం వాతావరణబీమా విడుదల చేయాలని ఎపి. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జె.వి.రమణ డిమాండ్ చేశారు. ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈకార్యక్రమములో జెవిరమణతో పాటు ఎపి రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బెల్లం మహదేవ్ మాట్లాడుతూ మండలంలో వేరుశనగ ,మిరప, టమోటా, అరటి ,మొక్కజొన్న, మామిడి ,తదితర పంటలు అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల రైతులు పంటలను నష్టపోయారన్నారు. అయితే అధికారులు నష్ట పోయిన రైతులపేర్లు జాబితా లో చేర్చక పోవడంతోవాతావరణ బీమా అందలేదన్నారు. నష్టపోయిన రైతులకు రెండో విడతలో న్యాయం జరిగేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పింఛను ఇవ్వాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. చడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, ముత్యాలప్ప, వడ్ల గోవిందు, నాగరాజు, బి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న నాయకులు

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడా స్ఫూర్తిని చాటిన వారవుతారని మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంటాపురం గ్రామంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్లో అశోక్ ఎలెవన్ జట్టు,సందీప్ ఎలివన్ జట్ల మధ్య ఫైనల్‌పోరు రసవత్తరంగా సాగింది. మొదటగా అశోక్ ఎలెవన్ జట్టు 151 పరుగు చేయగా, సందీప్ ఎలివన్ జట్టు 129 పరుగులు మాత్రమే చేసిఓడిపోయింది. గెలుపొందిన అశోక్ ఎలెవన్ జట్టుకు మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ ట్రోఫీలతోపాటు రూ, లక్ష రూపాయల నగదు, రన్నర్ జట్టు సందీప్ ఎలివన్ జట్టుకు ట్రోఫీలతోపాటు రూ. 50 వేల రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాస్ నాయుడు, గంటాపురం జగ్గు, కన్వీనర్ నారాయణరెడ్డి, తాళ్లూరు సతీష్ కుమార్ చౌదరి, సురేంద్ర నాయుడు, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, సుబ్బరాయుడు, నెట్టెం రమణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మాజీమంత్రి, తదితరులు

పరిహారం పంపిణీలో రైతులకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి బత్తలపల్లి

పంటనష్టపరిహారం పంపిణీలో రైతులకు తీరని అన్యాయం జరిగిందని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం బత్తలపల్లిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్,ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాస నాయుడు, యర్రాయపల్లి సుబ్బరాయుడు,చిట్రా నాగభూషణ, కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల నడ్డి విరిసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2019లో అసెంబ్లీ సాక్షిగా ఉమ్మడి జిల్లా రైతాంగానికి రూ. 2000 కోట్లు ప్రకటించారని నేటికీ ఆ పరిహారం ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. 2022- 23 సంవత్సరానికి విడుదల చేసిన పరిహారం సాగు చేసి నష్టపోయిన పంటలకు కాకుండా సాగు చేయని అతి తక్కువ పంటలకు అరకొరగా పరిహారాన్ని మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వ్యవసాయ పనిముట్ల మీద సబ్సిడీలు ఎత్తివేసి నాయకులు జేబులు నింపుకునే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. నియోజకవర్గంలో అధికశాతం మంది రైతులు వా వేరుశనగ సాగు చేయగా ఈ పంటకు పరిహారం దక్కలేదని, చీని, కంది, మొక్కజొన్న తదితర పంటలకు అరకొరగా పరిహారాన్ని మంజూరు చేశారని విమర్శించారు. గ్రామాలకు వచ్చినప్పుడు ఎమ్మెల్యేను అరకొర పరిహారం గురించి నిలదీయాలని టిడిపి నాయకులు రైతులకు సూచించారు. రైతాంగ సమస్యలపై ఈనెల 7న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు రైతులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్ర నాయుడు, నాయకులు నెట్టెం రమణ, గంటాపురం జగ్గు, తెలుగు యువత నాయకులు తాళ్లూరు సతీష్ కుమార్ చౌదరి, రాగవంపల్లి శీనా తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి : కలెక్టర్



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మన్యం ప్రజల హక్కుల కోసం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి చిన్న వయసులోనే ఉద్యమ స్ఫూర్తితో దేశభక్తితో పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివ రంగ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఎంహెచ్‌ఒ కృష్ణారెడ్డి, పిఆర్ ఎస్‌ఇ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో అల్లూరి సీతా రామరాజు జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల పోరాల సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఎంఎస్ షబ్బీర్, నాయకులు నారాయణ, అక్కులప్ప, వెంకట రమణప్ప, ఆటో అల్లాబక్షు, సుబహాన్, రామచంద్ర, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మిట్ట ఆంజనేయ స్వామి దేవస్థానం దగ్గర వున్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పూలమాల ఘన నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీపీ నాయుడు, కురుబ కృష్ణమూర్తి, చిన్నప్పయ్య, సిద్దలింగప్ప, హుజూర్, రఘువీర చౌదరి, రామలింగ, శ్రీనివాసులు, ఫరూక్, బోయ అనిల్ , రియాజ్, నారాయణ నాయక్, బాలు నాయక్, దోని లక్ష్మి నారాయణ, చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు. దళిత సంఘ సభ్యుల ఆధ్వర్యంలో అల్లూరి కి ఘన నివాళి అర్పించారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : భారతీయుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్ ప్రసాద్, అధ్యాపకులు ఓబయ్య, చంద్రమోహన్, దస్తగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎంపీపీ ప్రమీల మూర్తి, జెడ్పీటీసీ జయరాం నాయక్, ఎంపీటీసీ సోమశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో గ్రామోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ రజతోత్సవవేడుకల్లో భాగంగా మంగళవారం సాయినాథుడు పూలరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో సెమినారాయణస్వామి కోలాట మహిళాబృందం, కేరళ, కర్నాటక కళాకారులు ప్యాధిండి నరసింహులు, చెక్కభజన బందం, రామలక్ష్మణులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బంధనాథం సూర్యప్రకాశ్, కార్యదర్శిరాంప్రసాద్, కోశాధికారి హేమంత్ కుమార్, సభ్యులు టీసీ నారాయణరెడ్డి, సూర్యనారాయణ, రామలింగయ్య, జేసీ నాయుడు, వీరనారాయణ, మంజు, లీల,శోభ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏడుగురికి గాయాలు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలో బెంగుళూరు -హైదరాబాద్ జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు... సోమందేపల్లి మండలం బ్రాహ్మణ పల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారందరూ అరుణాచలంకు తీర్థయాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. జాతీయ రహదారిలో పాలసముద్రం క్రాస్ సమీపం వద్దకు వారి వాహనం రాగానే సోమందేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ అశోక్ నిద్రమత్తులో డివైడర్‌కు ఢీకొన్నాడు. వాహనంలో పదిమంది వస్తుండగా ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారుప. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ...

బత్తలపల్లి : మండల పరిధిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద గత శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన గంగలక్ష్మీ(52) తన కుమారుడు వెంకటేష్‌తో కలిసి శనివారం ద్విచక్రవాహనంలో మండలంలోని డి. చెర్లోపల్లిలోని సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. అదేరోజు సాయంత్రం తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైట్లకు గుంతలోకి వాహనాన్ని దించాడు. ఈ ప్రమాదంలో గంగలక్ష్మీ కిందపడి తీవ్రంగా గాయపడింది. అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

గోరంట్ల రూరల్: మండల పరిధిలోని పాలసముద్రం, రామిరెడ్డి కోళ్ల ఫారం వద్దజాతీయ, రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. శ్రీరామ్ (67) రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి వస్తున్న మారుతి షిఫ్ట్ కారు, వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరామ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుబ్బారాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కదిరి అర్బన్ : పట్టణ పరిధిలోని రాయలసీమ కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడిని తీవ్ర గాయాలు అయ్యాయి. ద్విచక్రవాహనాన్ని ట్రిపర్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంలోని మధు అనే యువకునికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక సీఐ తమ్మిశెట్టి మధు స్పందించి గాయాలపాలైన మధును కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన మధు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు అయితే అతనికి వైద్యసేవలు అందించడానికి కుటుంబ సభ్యులు ఆర్థికంగా లేరని ఆవేదన పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మడకశిర : పట్టణంలోని కళ్యాణి ఎలక్ట్రికల్స్ షాపు దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ వ్యక్తి నెల రోజుల క్రితం రొల్ల మండలం మళ్లీనా మడుగు గ్రామంలో పాత్ర సామానులు అమ్ముకుంటూ కన్పించాడని స్థానికులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ముదిగుబ్బ : మండలంలోని అర్హులైన రైతులకు తక్షణమే బీమా పరిహారం అందజేయాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మండలంలో 70 శాతం మంది వేరుశనగ పంట జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వేరుశనగ పంటకు ప్రభుత్వం బీమా పరిహారం ఒక్క పైసా కూడా అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మిగతా పార్టీల నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంజేపల్లి కృష్ణయ్య, తిప్పయ్య, రామకృష్ణ, అదెప్ప తదితరులు పాల్గొన్నారు

గోరంట్ల ఎంఇఒగా జాన్ రెడ్డప్ప

గోరంట్ల : మండల విద్యాధికారి వన్‌గా జాన్ రెడ్డప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కదిరి బాయ్స్ హై స్కూల్ నుండి హెచ్‌ఎం గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై గోరంట్ల మండలానికి ఎంఇఒగా వచ్చారు ఈ సందర్భంగా ఎంఈఓ 2 గోపాల్, ఉపాధ్యాయులు నూతన ఎంఇఒను కలిసి శుభాకాంక్షలు తెలిపారు?

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్



కొత్తచెరువులో ధ్రువపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

జగనన్న సురక్ష పథకం ద్వార లబ్ధిదారుల ముంగిటకే సంక్షేమ పథకాలు చేరువ అవుతున్నాయని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ అర్హత ఉండి వివిధ చిన్న కారణాలతో సంక్షేమ పథకాలకు దూరమైన వారికి లబ్ధి చేకూర్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమం లో వైసిపి హిందూపురం నియోజక వర్గ మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, సర్పంచి చామంతి, వైస్ ఎంపిపి అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తెలిపారు. మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, ఎంపీడీవో సిద్ధారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతితో పాటు ఆయా శాఖల అధికారులు, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, సర్పంచి గీతాబాయ్‌తో పాటు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం మానేపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అర్హులకు మంజూరైన 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణాల శ్రీనివాస రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ , ఎంపిడివో నరసింహ నాయుడు, తహశీల్దార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : మండలంలోని దుద్దెబండ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గౌతమి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ ను నిర్వహించారు. గ్రామ సభలో అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకరప్ప, తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీపీ గీత రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : జగనన్న సురక్ష ఒక బహుత్తర కార్యక్రమని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 1, 2, 33, 39, 3, 4, 5, 40వ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని కొట్లపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ అశోక్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ గంగాధర్, ఎంపిపి ఎవి. రమణారెడ్డి, వైసిపి జిల్లా ఎస్టీసెల్ తిరుపాల్ నాయక్, మండల కన్వీనర్ నర్సారెడ్డి, కొట్లపల్లి, రాచువారి పల్లి, ఇరగరాజపల్లి, సర్పంచులు కుల్లాయి రెడ్డి, వెంకటరెడ్డి ,వెంకటప్ప పాల్గొని ప్రసంగించారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కట్టారుపల్లి సచివాలయ పరిధిలోని మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జగనన్న సురక్ష 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాషా, ఎంపిడవొ యాదవేంద్ర, ఇఒఆర్‌డి సునీతతో పాటు ఆయా శాఖల అధికారులు, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల పరిధిలోని కరికెర గ్రామంలో మంగళవారం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సంఘం చైర్పర్సన్ నళిని రంగే గౌడ్, వడ్డగెరప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ జయ రాములు, జెడ్పీటీసీ భూతరాజు, ఎంపీపీ రాధమ్మతో పాటు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్: జగనన్న సురక్ష లో భాగంగా గోరంట్ల మండల పరిధిలోని కమ్మవారి పల్లి గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం ముగిసిందని ఎంపీడీవో రఘునాథ గుప్తా తెలిపారు. కమ్మవారిపల్లి సచివాలయం పరిధిలో 27 తేదీ నుంచి సచివాలయ సిబ్బంది సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గహ సారథులు, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని,వారికి కావలసినటువంటి సేవలను నమోదు చేసుకొని తేదీ నాలుగవ తేదీ వరకు కమ్మవారిపల్లి సచివాలయంలో నిర్వహించామన్నారు. వివిధ సేవల కోసం నమోదు చేసుకున్నటువంటి ప్రజలందరికీ కమ్మవారిపల్లి పంచాయతీ సచివాలయంలో డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మనిశివ శంకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఎంపిపి ప్రమీలామూర్తి, ఎంపిటిసి శ్రీనివాస్, జెడ్పీటీసీ జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు

ధర్మవరం టౌన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందనిమున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని6,7,8వ వార్డుల ప్రజల నిమిత్తం మంగళవారం శివానగర్‌లోని పార్కులో ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో ఇదివరకే 11 రకాల సర్టిఫికెట్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గడ్డం వరలక్ష్మి, బ్రహ్మయ్య ఆచారి, మానపల్లి సాయికుమార్, టిపిఒ సుబ్బరాయుడు తదితర అధికారులతో పాటు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మడకశిర : జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సాయినగర్, మలేరొప్పం సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ ధ్రువపత్రాలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ముర్షద్ వలి, మునిసిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు, మున్సిపల్ చైర్మన్ తనయుడు జయరాజ్ ,వైస్ చైర్మన్ రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని ఈ తోడు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాల మంజూరులో పారదర్శకత కోసం గ్రామంలోని ప్రతి ఇంటికి సిబ్బంది హాజరై అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, మండల నాయకులు కొక్కంటి వైవి శ్రీనివాసులు నాయుడు, రాము సర్పంచి నాగేంద్ర, ఎంపీడీవో నరసింహులుతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ న్యాయం చేయడానికి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, తహశీల్దార్ రవికుమార్, ఎంపీపీ రమణారెడ్డితో పాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.